## క్లుప్తంగా

### చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

**తలమడుగు:** ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. శుక్రవారం మండలంలోని సకినాపూర్ గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు అనుకూలంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. కోర్టులలో కేసులు ఉన్నవారు ఇరువర్గాల రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యశ్వత్ సింహా, ఎంపీడీవో రమాకాంత్, డీటీ సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### 'నవోదయ'కు ఎంపిక



నోముల అస్మిత

**బోథ్:** నవోదయ పాఠశాలలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో బోథ్ మండల కేంద్రానికి చెందిన తిరుమల్, హరిత దంపతుల కూతురు నోముల అస్మిత అనే విద్యార్థి సీటు సాధించింది. విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

### 'ప్రజల ప్రాణాలతో బీఆర్‌ఎస్ చెలగాటం'



మాట్లాడుతున్న మహేందర్

**ఇచ్చోడ:** బీఆర్‌ఎస్ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 12న ఖమ్మం జిల్లాలో కారెపెల్లి మండలంలోని చీమలపాడులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ముగ్గురు మరణించగా.. మరో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయని తెలిపారు. ఈ ఘటనకు బీఆర్‌ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబాల్లో ఒక్కరికీ ఉద్యోగం, గాయపడిన వారికి రూ. 50 లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు. బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి మెస్రం జంగుబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కామ్రె పోశెట్టి, నాయకులు పాముల హరినాథ్, క్రాంతికుమార్, అడెల్లు పాల్గొన్నారు.

### మహిళలకు చీరలు పంపిణీ

**బోథ్:** అంబేద్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కుచులాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, ఉప సర్పంచ్ దాస్, వీడీసీ అధ్యక్షుడు అడెల్లు, కొమ్ము గోవర్ధన్, శ్యామ్, ప్రవీణ్, అరుణ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### జాతీయ అగ్నిమాపక దినోత్సవం



నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**ఇచ్చోడ:** మండల కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో శుక్రవారం జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని నిర్వహించారు. విధుల్లో ఉండి ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అగ్నిమాపక శాఖఆధికారి రామారావు మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నుంచి ప్రజలను రక్షించడానికి అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

**బజార్‌హత్నూర్:** మండలంలోని చిన్నహత్నూర్ గ్రామానికి చెందిన సెడ్మకి విజయలక్ష్మి శుక్రవారం కడుపునొప్పితో బాధపడుతుంటే గ్రామ ఆదివాసీ యువజన సంఘం సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిర్మల్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. గర్భసంచికి ఇన్‌ఫెక్షన్ కావడంతో తొలగించాలని వైద్యులు తెలిపారు. తేజ ఆసుపత్రి వైద్యుడు నేర్ల ప్రమోద్ వైద్యఖర్చులు భరించడానికి ముందుకురావడం, బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన జడల చంద్రశేఖర్, ఇర్ల శేఖర్ రక్తదానం చేశారు.

# అంబేద్కర్‌కు నివాళి



తలమడుగు: నినాదాలు చేస్తున్న నాయకులు



ఉట్నూర్: నివాళులర్పిస్తున్న అధికారులు



ఇంద్రవెల్లి: ప్రార్థనలు చేస్తున్న దళితులు



బేల: మణియార్‌పూర్‌లో..

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. పోలీస్ రెండో బెటాలియన్ యాపల్‌గూడలో కమాండెంట్ ఆర్.వేణుగోపాల్, అడిషనల్ కమాండెంట్ ఎం.జయరాజు పాల్గొన్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



బోథ్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న పాయల్ శంకర్



తాంసి: నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



నేరడిగొండ: మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్‌జాదవ్



నార్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఎదులాపురం: ఏఐటీయూసీ నాయకులు



ఇచ్చోడ: పూలమాల వేస్తున్న నాయకులు



ఉట్నూర్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



గుడిహత్నూర్: నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు



ఆదిలాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న పోలీసులు



ఆదిలాబాద్‌రూరల్: పట్టణంలో బైక్‌ర్యాలీ



ఆదిలాబాద్: ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో..



బజార్‌హత్నూర్: పూలమాల వేస్తున్న విద్యార్థినులు



సిరికొండ: దళిత శక్తి ఆధ్వర్యంలో..

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆదిలాబాద్‌టౌన్:** ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్, రాణీ సతీజీకాలనీ, అశోక్‌రోడ్, కొలిపురా, బొక్కలగూడ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. కైలాసనగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### నేటితో ముగియనున్న శనగ కొనుగోళ్లు

**బేల:** మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో శనివారం శనగ కొనుగోళ్లు నేటితో ముగుస్తాయని బేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి

**కుంటాల:** గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని సర్పంచ్ సమత పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### చైతన్యపర్చేందుకే ఇంటింటికీ బీజేపీ



మాట్లాడుతున్న నర్సాగౌడ్


**ఖానాపూర్:** సీఎం కేసీఆర్ పాలనలో బీసీల అణచివేతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే పల్లెపల్లెకు ఓబీసీ-ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టామని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. ఈ నెల6న ప్రారంభమైన కార్యక్రమం శుక్రవారం ముగిసిందన్నారు. చివరిరోజు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోస్కుల మల్లేశ్, నాయిని సంతోశ్, లాండేరి కిషన్, గుడాల రాజన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మక్క పంట.. అమ్మేదెట్లా?

- కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వని సర్కారు
- పేరుకుపోయిన నిల్వలు
- తగ్గిన దిగుబడి.. పడిపోయిన ధరలు

**జిల్లాలో మొక్కజొన్న సాగు వివరాలు..**

| | |
|---|---|
| సాధారణ సాగు: | 4559 (ఎకరాలు) |
| గతేడాది సాగు : | 6063 (ఎకరాలు) |
| ఈఏడాది సాగు : | 14415 (ఎకరాలు) |



ఆరబెట్టిన మక్కలు

**బోథ్:** ఆదిలాబాద్ జిల్లాలో మొక్కజొన్న రైతులకు కష్టమొచ్చింది. దిగుబడి తగ్గినా, ధరలు ఆశాజనకంగా ఉంటాయనుకున్న కర్షకులకు నిరాశే మిగులుతోంది. పంట చేతికి రాగానే ధరల పతనం మొదలు కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుపై ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈ పరిణామం దళారులకు కలిసొచ్చేలా ఉంది. ఇదే అదనుగా వ్యాపారులు మద్దతు ధర కంటే దిగువకు కొనుగోలు చేస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో రైతులు యాసంగిలో ఎక్కువగా మక్కలను సాగు చేశారు. జిల్లాలో ఈసారి సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువగానే పంట సాగు చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న వంద శాతం చేతికొచ్చింది.

**దిగుబడి తగ్గింది..**

గతేడాది ఎకరాకు 40- 45 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈసారి 30- 35 క్వింటాళ్ల లోపే వచ్చింది. గతేడాది బహిరంగ మార్కెట్లో క్వింటా మొక్కజొన్న జొన్న రూ.2,500 వరకు ధర పలికింది. ఈసారి మార్చిలో రూ. 2,200 వరకు పలికింది. ఏప్రిల్ 10 నాటికి క్వింటాకు రూ.1,820 పడిపోయింది. కేవలం 15 రోజుల వ్యవధిలో రూ.400 వరకు ధర పతనం కావడంతో కర్షకులు ఆందోళన చేస్తున్నారు. పెట్టుబడి ఎకరాకు రూ.30 నుంచి రూ. 40 వేల వరకు పెట్టామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిన సాగు..**

జిల్లాలో మొక్కజొన్న సాగు ఈఏడాది గణనీయంగా పెరిగింది. సాధారణ సాగు 4559 ఎకరాలు ఉంది. కాగా గత ఏడాది 6063 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. గత ఏడాది మొక్కజొన్నకు ధర రూ. 2500గా ఉండడంతో ఈ ఏడాది రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. 14,415 ఎకరాల్లో సాగు చేశారు. కానీ రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

#### ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1800 పలుకుతోంది. తక్కువ ధరతోనే పంటలను దళారులకు విక్రయించాల్సి వస్తోంది. దీంతో రైతులకు నష్టం జరుగుతోంది. ఐదెకరాల్లో మొక్కజొన్న వేశాను. ఎకరానికి 45 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– లక్ష్మణ్, రైతు, బోథ్

#### ఎలాంటి సమాచారం లేదు

మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి ప్రపోజల్స్ వస్తే కొనుగోళ్లు చేస్తాం. ప్రస్తుతానికి మొక్కజొన్న కొనుగోళ్లు జరపడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– గౌరీ నాగేశ్వర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

### జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



పాల్గొన్న ముస్లిం నాయకులు

**ఆదిలాబాద్:** తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు మహ్మద్ అత్తరుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, బీఆర్‌ఎస్ నాయకులు జోగు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

**బేల:** మండల కేంద్రంలోని మదీనా మసీదు ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఎంపీపీ కుంట రఘుకుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, విందు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ వైఎస్ ఎంపీపీ నిపుంగే సంజయ్, మైనార్టీ నాయకులు సాదిక్, సర్ఫరాజ్, తన్వీర్, తదితరులు పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్.. వృథాగా భగీరథ నీరు..



**నేరడిగొండ:** మండలంలోని వాంకిడి గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకును ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు ట్యాంకు ద్వారా మంచినీరు అందాల్సి ఉండగా.. వృథాగా పోతోంది. అయినా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి భగీరథ నీరు వృథా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి: శోభన, ఎంపీవో, నేరడిగొండ, ఫోన్: 94915 58253

### గర్భిణులకు వైద్య పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఎండీ సద్దాం

**నేరడిగొండ:** నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎండీ సద్దాం ప్రజలకు అందుబాటులోకి వచ్చారు. శుక్రవారం 'సాక్షి'లో పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం అనే కథనం ప్రచురించింది. దీంతో వైద్యాధికారి విధులకు హాజరై ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా 24 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కాగా ఎంపీపీ రాథోడ్ సజన్ పీహెచ్‌సీని సందర్శించారు. విధులకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇకపై వైద్యుడు అందుబాటులో ఉండేలా.. ఇప్పటికైనా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

**తాంసి:** ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించాలని భీంపూర్ మండల వీవోఏలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని అర్లి(టి) గ్రామంలో వీవోఏలు నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ.. వీవోఏల సమస్యలు పరిష్కారించడంతో పాటు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేశ్, వీవోఏలు సురేశ్, విజయలక్ష్మీ, పోచ్చక్క, రజిత పాల్గొన్నారు.